

వెల్గటూర్: పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్



కథలాపూర్: వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడకు మేక పిల్ల బహుమతిగా ఇస్తున్న తాండ్ర్యాల యాదవులు



గోదావరిఖని: రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు హారతి ఇస్తున్న మహిళ



గంగాధర : సర్వారెడ్డిపల్లిలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# జనంలోకి 'బలగం'

## ప్రచారంలో కుటుంబసమేతంగా

- నియోజకవర్గాల్లో 'నలు'వైపులా ముమ్మర ప్రచారం
- ఓటర్లతో మమేకమవుతున్న అభ్యర్థులు
- వారికి మద్దతుగా సతీమణులు, తనయులు, కోడళ్లు
- పల్లె, పట్టణ ప్రజానీకంతో మమేకం
- గడపగడపకూ వెళ్లి మ్యానిఫెస్టోనూ చూపుతూ ఓట్ల అభ్యర్థన

జగిత్యాల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న అన్ని పార్టీల కంటే ముందు అభ్యర్థులను ప్రకటించారు. ఆ వెంటే క్యాండిడేట్లు రంగంలోకి దిగారు. దాదాపు రెండు నెలలుగా ప్రజాక్షేత్రంలో కలియదిరుగుతున్నారు. నిత్యం జనంతో మమేకమవుతూ, ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమను ఆశీర్వదిస్తే రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గాలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెబుతున్నారు. వీరికి తోడుగా కుటుంబసభ్యులు కూడా ఎన్నికల క్షేత్రంలోకి దిగారు. సతీమణులు, కొడుకులు, బిడ్డలు, కోడళ్లు ముమ్మర ప్రచారానికి నడుం బిగించారు. నియోజకవర్గాల్లో నలువైపులా కలియదిరుగుతున్నారు. పల్లె పట్టణం అనే తేడా లేకుండా అంతటా హోరెత్తిస్తున్నారు. సర్కారు పథకాల లబ్ధిదారులను కలుస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్నారు. మ్యానిఫెస్టోను చూపుతూ చేపట్టబోయే అభివృద్ధి పనులు, కొత్త స్కీంల గురించి విడమరిచి చెబుతున్నారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని, ప్రజల జీవితాల్లో మార్పులను గమనించాలని కోరుతున్నారు. మళ్లీ కారు గుర్తుకు ఓటేసి ఆదరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.



కరీంనగర్: ఆర్టీసీ సమ్మేళనంలో భోజనం వడ్డిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



కాల్వశ్రీరాంపూర్: పందిల్లలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి కొడుకు ప్రశాంత్‌రెడ్డి



కొత్తపల్లి: మల్కాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి గంగుల సతీమణి రజిత



సుల్తానాబాద్ :10 వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి దాసరి పుష్పలతరెడ్డి



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న జగిత్యాల అభ్యర్థి సంజయ్ సతీమణి రాధిక

### జనంలోనే డాక్టర్ ఎం సంజయ్

జగిత్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ వెంటే కుటుంబసభ్యులు ప్రచారంలోకి దిగారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలోని గ్రామాలన్నీ చుట్టేస్తుండగా, ఆయన సతీమణి రాధిక జిల్లా కేంద్రంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. గడపగడపకూ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. పట్టణంలోని ఓటర్లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు వార్డుల్లో కలియదిరుగుతున్నారు. ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులను ఆత్మీయంగా పలుకరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. సంక్షేమ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్నారు. బతుకమ్మ పండగ తొమ్మిది రోజులు బతుకమ్మ ఆడుతూ ప్రచారం చేశారు.



జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న జగిత్యాల అభ్యర్థి సంజయ్ సతీమణి రాధిక



మన్నెగూడెంలో ప్రచారం చేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు సతీమణి సునీల

### ప్రచారంలో చల్మెడ సతీమణి

వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రచారంలో దూసుకెళ్తుండగా, ఆయనకు మద్దతుగా సతీమణి సునీల ఎన్నిక ప్రచారం చేస్తున్నారు. కొద్ది రోజులుగా నియోజకవర్గంలో గడపడగడకూ వెళ్తున్నారు. ఇప్పటి వరకు వేములవాడ మున్సిపల్ పరిధిలోని మార్కండేయనగర్, రుద్రంగి, మన్నెగూడంలో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. మహిళలను ఆప్యాయంగా పలుకరించారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అమలు చేయబోయే పథకాలను గురించి వివరించారు. కారు గుర్తుపై ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేద్దామని కోరారు.



మెట్‌పల్లిరూరల్: మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు- సరోజన దంపతులు

### ప్రజాక్షేత్రంలో సంజయ్ కల్వకుంట్ల కుటుంబం

కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల, సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ప్రతి పల్లెకూ వెళ్తున్నారు. ప్రజల మధ్యే ఉంటున్నారు. ఆయనకు మద్దతుగా కుటుంబసభ్యులు విజయం కోసం కదనరంగంలోకి దిగారు. అభ్యర్థిత్వం ఖరారైన తెల్లారి నుంచే ప్రచారపర్వంలో దూసుకెళ్తున్నారు. ఆయన తండ్రి విద్యాసాగర్‌రావు, తల్లి సరోజన ఇద్దరూ తలోదిక్కునా ముమ్మర ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సరోజన కోరుట్ల, మెట్‌పల్లిలో పట్టణ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే తన పరిధిలోని పల్లెలను చుట్టేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మహిళలకు బొట్టుపెట్టి బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలని అర్థిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కలిగే అనర్థాలను వివరిస్తూ ముందుకుసాగుతున్నారు. కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి చోటివ్వాలని విజ్ఞప్తిచేస్తున్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. కొడుకు వెంట అడుగులు వేస్తూనే ప్రచార పర్వాన్ని దగ్గరుండి పూర్తి చేయిస్తున్నారు. ఇప్పటికే తనను నాలుగుసార్లు ఆదరించి గెలిపించారని, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని వివరిస్తున్నారు. తన కొడుకు సంజయ్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే కలిగే నష్టాలను వివరిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులను ఆత్మీయంగా పలుకరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.



ధర్మారం: ఖిలావనపర్తిలో ప్రచారం చేస్తున్న మంత్రి ఈశ్వర్ కూతురు నందిని

### ప్రచార పర్వంలో కొప్పుల కుటుంబసభ్యులు

అసెంబ్లీ ఎన్నికల నగార మోగిన వెంటనే ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రచార పర్వాన్ని ప్రారంభించారు. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోని తన ధర్మపురకి నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో గులాబీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. కుల సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని సిద్ధం చేశారు. ధర్మపురి గడ్డపై మళ్లీ గులాబీ జెండాను ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. పలు గ్రామాల్లో ప్రజాఆశీర్వాద సభలు నిర్వహించారు. కూడళ్లలో ఏర్పాటు చేసిన మీటింగ్‌ల్లో తన హయాంలో చేపట్టిన పనులను వివరించారు. ప్రత్యేక పోరులో పోషించిన పాత్రను గుర్తుచేశారు. అలాగే ఆయన సతీమణి కొప్పుల స్నేహలత, కూతురు నందిని 20 రోజుల నుంచి ఊరూరా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను పంచుతూ..మహిళలకు బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేస్తూ ముందుకెళ్తున్నారు. స్నేహలత కొప్పుల సేవాసమితి చైర్పర్సన్‌గా తాను చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరిస్తున్నారు. మళ్లీ గెలిస్తే చేపట్టబోయే పనులును తెలియజేస్తున్నారు. ప్రజలు స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.



వెల్గటూర్: చెగ్యాంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ భార్య స్నేహలత ప్రచారం

### ఇంటింటికీ వెళ్తున్న 'సుంకె' సతీమణి

చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఆమె సతీమణి దీవెన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. గంగాధర మండలంలోని బూరుగుపల్లి, గంగాధర, ఇస్లాంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలను కలిసి నియోజకవర్గంలో తన భర్త చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో చల్మెడకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



రామగిరి మండలంలో ప్రచారం చేస్తున్న మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సతీమణి శైలజ